

# సంధ్యారాగం

## అవధానుల విజయలక్ష్మి

ఒణుకుతున్న చూపుడు వేలితో ఆమె అతని నుదుటి మధ్యనించీ ముక్కుమీదికీ అక్కడినించి పెదవుల మీదికీ అక్కడనుండి గెడ్డం మీదికీ సున్నితంగా రాసింది.

గాఢంగా నిద్రపోతున్నాడతను.

ఆమె చేతి ప్రకంపనాలు అతని శరీరంలో అణువణువూ వ్యాపించి అక్కడి నుంచి హృదయాన్ని తాకి....గాఢ సుషుప్తిలో ఉన్న అతనికి ఎక్కడో దేవలోకంలో దేవకన్య వీణ శృతి చేస్తున్న అనుభూతి కలిగించింది. ఆమె తన చూపుడు వేలితో అలా సున్నితంగా రాసినప్పుడల్లా అతనికి అలాగే అనిపిస్తుంది.

ఆమె అతన్ని లేపే పద్ధతి అదే!

మత్తుగా కళ్ళు విప్పాడతను. నిద్ర విడని కళ్ళతో మత్తుగా చూశాడామెవైపు "లేవాలి!" అందామె మంచం మీద ఒంగొని....పడుకున్న అతనికి రెండువైపులా రెండు చేతులూ వేస్తూ ప్రేమగా, గోముగా.

"ఊ" బద్ధకంగా మూల్గుతూ అతను పక్కకు ఒత్తిగిల్లాడు. "మా బుజ్జిబాబు ఇవాళ తొందరగా లేచిపోతాట్ట!" అందామె అతని చెవి దగ్గర గుసగుసగా.

"అబ్బ! ఇంకా చీకటైనా పోలేదు....అప్పుడే లేపేస్తున్నావు" అన్నాడతను. కళ్ళు విప్పకుండానే. ఆమె మెడలోంచి వేళ్ళాడుతూ అతని మొహాన్ని తగులుతున్న మంగళ సూత్రాలతో ఆడుకుంటూ "ఇవాళ పండుగ! మర్చిపోయారేమిటి?" అందామె ప్రేమగా, మూసి వున్న అతని కనురెప్పల్ని రెండు వేళ్ళతో విడదీయడానికి ప్రయత్నిస్తూ. "నీకు పండుగ కానిది ఎప్పుడోయ్....కార్తీక సోమవారాలు, మార్గశిర లక్ష్మి వారాలూ, శ్రావణ శుక్రవారాలూ...." అన్నాడతను కళ్ళు పూర్తిగా విప్పి ఆమెవైపు చిలిపిగా చూస్తూ.

"పోండి .... ఇవాళంతా నేను మీతో మాట్లాడను" ఆమె చటుక్కున మంచం మించి చేతులు తీసేసి నిల్చొంది.

అతను గబుక్కున ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"అలగకోయ్ .... ఎన్నేళ్ళయినా ఎన్ని జన్మలెత్తినా నేనీ రోజుని ఎలా మర్చిపోతాను? ఈ రోజేగా ఈ అమ్మాయి మెడలో ఇలా మూడు ముళ్ళు వేసేశాను" అన్నాడు ఆమె మెడ చుట్టూ చేతులు వేసి ముద్దు పెట్టుకోడానికి అభినయిస్తూ.

ఆమె మధురంగా నవ్వింది.

"పదండి మరి! .... మొహం కడుక్కోడం గట్రా తొందరగా చేసేస్తే మీకు నీళ్ళు పోస్తాను."

ఆమె చేయందించింది. అతను బద్ధకంగా లేచాడు.

మరో పావుగంట తర్వాత ఆమె చేయి పట్టుకుని అతన్ని బాత్‌రూం వైపు నడిపించింది.

పెద్ద బిందెలో ఆవిర్లొస్తున్న వేడి నీళ్ళు.... నానపెట్టిన కుంకుడు కాయలు చిన్న ప్లేట్లో నలుగు పిండి....అన్ని అక్కడ సిద్ధంగా ఉన్నాయప్పటికే. ఇద్దరూ లోపలికి నడవగానే అతను తలుపేసేశాడు.

ఆమె చిన్న గిన్నెలో ఉన్న నూనె కొంచం చేతిలో పోసుకుని ముందుగా అతని కుడి చేతిని అందుకుని రాసింది....ఆ తర్వాత ఎడం చేతికి....

"ఎంత హాయిగా ఉందో ... రోజూ యిలాగే నలిచి నీళ్ళు పొయ్యకూడదటోయ్ ఒక్కణ్ణే రోజూ స్నానం చేసి చేసి చికాకేస్తోంది" అన్నాడతను ఒంటికి తగిలీ తగలని స్పర్శతో మర్దన చేస్తున్న ఆమె చేతి గాజుల్ని సవరిస్తూ.

"చాల్లెండి ఎవరైనా వింటే నవ్వుతారు.... ఇంకా మీకే బుద్ధులు పోలేదు."

"ఎవరు వింటారోయ్! అందుకేగా బాత్రూం

తలుపులు వేసేశాను.''

"అందుకేగా నేనూ మిమ్మల్ని ఇంత చీకట్నే లేపేశాను!''

"లచ్చూ!''

"ఊ!''

" ఒక్కొక్కసారి అనిపిస్తుంటుందిరా నువ్వు లేకపోతే నేనెలా ఉండగలనో అని! చచ్చిపోయే దాకా నాతోనే ఉంటావు కదూ!''

"ఉష్! ఏమిటా మాటలు? మీరు లేకుండా నేనూ ఒక్క క్షణం ఉండలేను. నేను అటువంటి మాటలంటున్నానా?''

"అందుకే లచ్చూ....ఇద్దరం కలిసి ఒక్కసారే చచ్చిపోదాం.''

"ఇంక ఆ చావు మాటలు మానేయండి.... శుభమాని ఈ రోజు కూడా ఆ మాటలేనా'' అందామె చేతిలోకి నలుగుపిండి తీసుకొని అతని వీపుకి పట్టిస్తూ.

అతను మెల్లగా వంగి ఆమె చూడకుండా చేతిలోకి ఇంత నలుగుపిండి తీసుకుని గబగబా ఆమె మొహానికీ చేతులకు పులిమేశాడు. ఆమె చిరుకోపంతో చూసింది.

"అంతా ఎలా పూసేశారో చూడండి! స్నానం చేస్తేకాని పోదు!''

"మరేం ఫర్వాలేదోయ్....నువ్వు నాకు స్నానం చేయిస్తున్నావుగా అలాగే నీకు నేను.''

"అతని మాటలు పూర్తికాకుండానే బకెట్లో నీళ్ళు దోసిటితో తీసి అతని మొహాన్ని కొట్టింది. మొహం మీద పడ్డ నీళ్ళు తుడుచుకొంటూ అతను చిలిపిగా చూశాడు.

ఆమె చేతులూ, మొహం కడిగేసుకొని నలుగుపిండి తీసుకొని అతని గుండెలకి రాయసాగింది.

గుండెలమీంచి ఆమె చెయ్యి పొట్టమీదికి రాగానే అతను కితకితలు పెట్టినట్లు నవ్వాడు.

"ఇన్నాళ్ళయినా ఇంకా కితకితలు పోలేదు.. ఏ మనిషి బాబూ'' అతని నవ్వు చూసి తను కూడా పక్కున నవ్వుతూ.

నవ్వుతున్న ఆమె మొహం వంకే చూస్తూ ఉండిపోయాడతను.

"అదేమిటలా చూస్తుండిపోయారు?''

"నీ నవ్వుని. పెళ్ళికాకముందు నీ నవ్వు మీద




ఎన్ని కవితలు రాసేవాడినో గుర్తుందా?''

"అవును....'నువ్వు నవ్వుతుంటే మల్లె మొగ్గలు వరసగా పేర్చినట్లుందనేవారు, ముత్యాలు కూర్చినట్లుందనే'వారు.''

"నీకు బాగానే గుర్తున్నాయే!''

" ఈ మాటలేమిటండీ! అప్పుడు మనం మాట్లాడుకున్న ప్రతిమాట ప్రతివాక్యం నా జీవితాంతం గుర్తుండిపోతాయి తెలుసా?'' అందామె చెంబుతో నీళ్ళు తీసి అతని ఒంటిమీద పోస్తూ. అతను తలమీంచి మొహం మీదికి కారుతున్న నీటిని చేతితో తుడుచుకొంటూనే, వేళ్ళ చివర్లతో కొన్ని నీళ్ళు ఆమె మొహాన్ని జల్లాడు.

ఆమె పక్కున నవ్వింది.

"లచ్చూ! అప్పుడేమో మరి....నవ్వుతుంటే మల్లె మొగ్గలు పేర్చినట్లుందనేవాణ్ణికదా! ఇప్పుడేమో దానిమ్మగింజలు పేర్చినట్లుంది.''

"అబ్బాయిగారికి కవిత్వం వాసనలింకాపోలేదు! బుద్ధిగా కళ్ళు మూసుకొని కూర్చోండి....తల రుద్దుతాను గట్టిగా గోల చేశారంటే బయట పిల్లలకి వినబడిపోతుంది.''

"అవును సుమీ....అసలే అల్లరి వెధవలు ప్రతిక్షణం మనల్ని డిటెక్టివుల్లా కనిపెడుతుంటారు.''

"అందుకే మరి....మా బుజ్జిబాబుట! బుద్ధిగా కూర్చొంటారట.'' అతను బుద్ధిగా కూర్చొన్నాడు.

"ఏమండీ ఇవాళ సాయంత్రం పార్కుక్కుకుండా గుడికి వెళ్దామండీ పెళ్ళిరోజు కదా?''

"సరే....దేవిగారి ప్రతిపాదననొప్పుకున్నాను. అయినా అదేమిటోయ్? సాయంత్రంపూట షికారు కెళ్ళినప్పుడు చెయ్యి పట్టుకొని ఒదలవు? ఎంత మొగుడినైతే మాత్రం? ఎవరైనా అందమైన అమ్మాయి ఎత్తుకుపోతుందని భయమా?''

"మీరు మాత్రం? నా భుజం మీద పూర్తిగా మీ భుజం ఆన్చేసి నడవరూ? అందుకే వీధిలో అందరూ కుళ్ళుతున్నారు.''

"కుళ్ళుతే కుళ్ళనిద్దూ...ఆ పాట విన్లేదూ? 'నవ్విపోదురుగాక' అని.''

" మొన్న పక్కింటి కామాక్షమ్మ, సావిత్రమ్మతో అంటుంటే విన్నాను. వాళ్ళిద్దరూ ఆ షికార్లేమిటి! పిల్లాజెల్లని ఇంట్లో ఒదిలేసి సిగ్గు లేకుండా అని.''

"అనుకోనిద్దూ....దాంపత్య జీవితంలోని మాధుర్యం తెలియని మోడులు వాళ్ళంతా.''

"అవును మరి....వాళ్ళుద్దేశం ప్రకారం సాయింత్రమయ్యేసరికి మీరు రచ్చబండ దగ్గరికి రాజకీయాలకి పోవాలి. నేనేమో అమ్మలక్కల ముచ్చట్లకి పోవాలి.''

"ఎవరెలాపోతే మనకేందుకు? నాకు నువ్వూ నీకు నేనూ'' అన్నాడతను ఒంగి ఉన్న ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి మరింత ఒంచుతూ అలా ఒంగోడంలో ఆమె పైట జారి అతని మొహాన్ని కప్పేసింది.

### సాహిత్య అకాడెమి బహుమతి గ్రహీత
### గూడపాటికృష్ణకుమారి

విజయనగరం మహారాజ మహిళా కళాశాలలో తెలుగుభాష ఉపన్యాసకురాలుగా వుంటున్న శ్రీమతి గూడపాటి కృష్ణకుమారికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమివారి 'బాలసాహిత్య' అవార్డు లభించింది. పది—



పదిహేను సంవత్సరాలలోపు వయసుగల పిల్లలకు ఉపయోగ పడే విధంగా 'రాణి రుద్రమదేవి'పై ఆమె రాసిన గ్రంథానికి ఈ బహుమతి (1980-81 సంవత్సరానికి) లభించింది.

శ్రీమతి కృష్ణకుమారి ఆంధ్ర విశ్వ విద్యాలయం ద్వారా భాషా ప్రవీణ' పట్టాన్ని, నాగార్జున విశ్వావిద్యాలయం ద్వారా ఎం. ఏ. పట్టాన్ని పొందారు. అక్కడే 'కలి జనాంజనం-ఒక పరిశీలన' అనే అంశంపై 1982 లో ఎం. ఫిల్ పొందారు. ప్రస్తుతం 'ఆంధ్ర శబ్ద చింతామణి తద్వ్యాఖ్యానాలు' అనే అంశంపై డాక్టరేటుకై కృషిచేస్తున్నారు.

శ్రీమతి కృష్ణకుమారి 'బాలవ్యాకరణ సంజ్ఞ చంద్రిక' అనే వ్యాకరణ గ్రంథాన్ని '74 లో ప్రచురించారు. ఇది వ్యాకరణ జిజ్ఞాసువులైన విద్యార్థులకు అత్యంతోపయోగకరమైన గ్రంథం. భాషాప్రవీణ కోర్సుకు రిఫరెన్స్ పుస్తకం. శ్రీమతి కృష్ణకుమారి అనేక సభల్లోనూ, ఆకాశవాణి నిర్వహించిన గోష్ఠి కార్యక్రమాల్లోను పాల్గొన్నారు. ఆమె విజయనగరం లోని సాంస్కృతిక సంస్థ 'రసజ్ఞ'కు కార్యదర్శిగా వున్నారు.

—ఎస్.

"నాకో పాట గుర్తొస్తుందోయ్" అన్నాడతను తన మొహాన్ని కప్పేసిన చీరని తీసి ఆమె భుజం మీద వేస్తూ.

"ఏం పాట?"

"కళ్ళు కనపడని భార్యకి మొగుడు వర్ణించి చెపుతుంటాడు. అదుగో అక్కడ కొండలున్నాయి. ఆ కొండల మీద కప్పేసి దూదిపింజెల్లా మబ్బులున్నాయి అని. ఆ మబ్బులెలా ఉన్నాయని అడుగుతుంది పెళ్ళాం. నీ పైటచెంగులా ఉన్నాయంటాడతను."

ఒక్కక్షణం అర్థం కానట్లు ఉండి పోయిందామె. అర్థమయ్యాక పక్కుమని నవ్విందామె.

"చాల్లెండి ఇప్పుడు ఆ మాట చెప్పడం?"

"లచ్చూ ఇవాళిలా తెల్లారి పోకుండా ఉంటే బాగుండును కదూ? హాయిగా ఇలాగే కబుర్లాడుకుంటూ గడిపేద్దుము" అన్నాడతను కొంచం దిగులుగా.

"అవునండీ .... ఇంకాస్సేపట్లో ఇంటిల్లిపాదీ లేచిపోతారు. మళ్ళా సాయంత్రం దాకా మీ రెక్కడో, నేనెక్కడో."

"అది సరేగాని .... సాయంత్రం సినిమా కెళ్దామా?"

ఆమె అతని నెత్తిమీద చిన్న మొట్టికాయ వేసింది.

"అబ్బాయిగారికి సినిమా చూడాలని బుద్ధి పుట్టిందేం? రాత్రవగానే ఒక్క బొమ్మైనా చూడగలరా?

"సినిమా బొమ్మని చూడలేకపోతే నా పక్కన ఉన్న బొమ్మని చూస్తూ కూర్చుంటాను."

"చాల్లెండి... సంబరం... ఊ·నిల్చోండి ఒళ్ళు తుడుస్తాను" ఆమె తన పైట కొంగుతో ఒళ్ళంతా ఒకొక్కటొట్టా సున్నితంగా ఒత్తుతూ తుడిచింది.

"చూశావా తువ్వాలు మర్చిపోడం ఎంత మంచిదయిందో!"

"మర్చిపోలేదు....ఆ గరుకు తువ్వాళ్ళతో తుడవడం నా కిష్టం లేదు. అయినా డాక్టరేం చెప్పారు? ఒంటిని చాలా సున్నితంగా చూసుకోమని చెప్పలేదూ?"

ఒళ్ళు తుడవడం అయ్యాక పసుప్పొట్లు పెట్టిన పంచె అందించింది.

"ఈ పంచెలో ఎలా ఉన్నానోయ్? ఎన్. టి. ఆర్‌లా ఉన్నానా?" పంచె సవరించుకుంటూ ఆమె వైపు చిలిపిగా చూస్తూ అడిగాడు.

ఆమె నవ్వు దాచుకుంది.

"కాదు....అమితాబ్‌బచ్చన్‌లా ఉన్నారు."

"అబ్బో నీకు కూడా హిందీ సినిమాల గురించి తెలుస్తోందే!"

"పోదురూ బడాయి....మీరేదో మహా హిందీ సినిమాలు చూసేసినట్లు..." ఆమె బాత్‌రూం తలుపు తీసింది.

ఇద్దరూ బయటకు నడిచారు. ఆమె అతని నడుం చుట్టూ చెయ్యి వేసింది. అతను తన కుడి చేతిని ఆమె భుజం చుట్టూ వేసి తలని ఆమె భుజం మీద ఆన్చాడు.

పార్వతీ పరమేశ్వరుల్లా, సీతారాముల్లా, లక్ష్మి విష్ణుమూర్తుల్లా గదిలోకి నడిచారు.

గదిలోకి అడుగు పెట్టబోతూ నిశ్చేష్టులైనట్లు నిల్చుండిపోయారు.

తలుపు కెదురుగా నిల్చున్నాడు పాతికేళ్ళ రవి. చేతిలో పూలగుత్తితో!

"నాయనమ్మా, తాతయ్యా! మీ యాభైయ్యవ వివాహ మహోత్సవ సందర్భంలో ఇదే నా కానుక!" నాటక ఫక్కీలో అంటూ చేతిలోని పూల గుత్తిని అందించాడు.

"బై ది బై పెళ్ళయి యాభైఏళ్ళయినా ఇంత అన్యోన్యంగా ఉండగలిగే రహస్యం చెప్తారా?" పాత్రికేయుడి పోజు పెట్టి నవ్వుతూ అడిగాడు.

"ఏమీ లేదు నాయనా! ఇద్దరం ఒకరినొకరు ఎలా లొంగదీసుకోవాలా? అని ఆలోచించకుండా ఒకరికొకరు ఎలా లొంగిపోడమా? అని ఆలోచించుకోవడమే ఆ రహస్యం" చిరునవ్వుతో జవాబిచ్చాడతను.

ఇద్దరూ ఒకరి కళ్ళలో ఒకరు చూసుకున్నారు. ఇద్దరి పెదవుల మీద విరిసీ విరియని నవ్వు మెరిసి మాయమయింది. □